క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

బచ్చన్నపేట: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎస్‌బీఎం డీసీ కరుణాకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రఘు రామకృష్ణ అధ్యక్షతన జరిగిన స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కలిగించారు. నర్మెట ఎంపీఓ అరవింద్, నర్మెట, తరిగొప్పుల, బచ్చన్నపేట మండలాల పంచాయతీ కార్యదర్శులు, ఈ పంచాయతీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

సమష్టిగా ముందుకెళ్లాలి

బచ్చన్నపేట: పురగిరి క్షత్రియులు సమష్టిగా ముందుకెళ్లాలని, ఐక్యతతో అన్ని సాధించవచ్చని కొడకండ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పేరం రాము అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పురగిరి క్షత్రియ సంఘ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు మంచాల వెంకటయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ ఉపాధ్యక్షుడు దాచేపల్లి మల్లేశం, ప్రధాన కార్యదర్శి సందెల బాలసిద్దులు, నాయకులు కృష్ణమూర్తి, నర్సింగారావు, సత్యనారాయణ, బాలరాజు, బుగ్గయ్య, హరినాథం, అనిల్, అశోక్, శ్రీధర్, వెంకటేష్, అశోక్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ..

● ప్రయాణికులకు గాయాలు

పాలకుర్తి టౌన్: పాలకుర్తి నుంచి హనుమకొండకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి లారీ ఢీకొట్టిన సంఘటనలో బస్‌లో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. బస్సు డ్రైవర్ గడ్డం వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. పాలకుర్తి మండలం మంచుప్పలలో నైట్ హాల్ట్ చేసి ఉదయం 5 గంటలకు పాలకుర్తి నుంచి హనుమకొండకు వెళ్తున్న బస్సు గూడూరు స్టేజీ వద్ద ప్రయాణికుల కోసం ఆపగా కరీంనగర్‌కు సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ బస్సును వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రయాణికులు చెన్నూరు గ్రామానికి చెందిన ఎస్‌కే పాషా, ఎలమ్మ, ప్రేమ్‌సాగర్, బమ్మెర గ్రామానికి చెందిన దొంతరబోయిన బుజ్జమ్మకు బస్సులో సీట్లు తగలడంతో గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను 108 వాహనంలో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. లారీ డ్రైవర్ నిద్రమత్తులో ఉండడంతో ఈ ప్రమాదం జరిగిందని ఆర్టీసీ డ్రైవర్ వేణుగోపాల్ తెలిపారు. ఘటన స్థలానికి పాలకుర్తి ఎస్సై శ్రీకాంత్ చేరుకొని కేసు నమోదు చేశారు.

మేకలగట్టులో 'కంటి వెలుగు'

రఘునాథపల్లి: చూపు మందగించిన వారికి ప్రభుత్వం వెలుగులు నింపేందుకు ఉచితంగా ప్రవేశ పెట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని మేకలగట్టు సర్పంచ్ గడ్డమీది సంధ్యారాణి అన్నారు. బుధవారం గ్రామ పంచాయతీ వద్ద రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కంటి వెలుగు గొప్ప వరమని, గ్రామస్తులు శిబిరంలో పాల్గొని ఉచితంగా కళ్లజోళ్లు తీసుకోవాలని కోరారు. ఎంపీటీసీ భిక్షపతినాయక్, ఉప సర్పంచ్ కొలిపాక సుధాకర్, మండల వైద్యాధికారి కమలహాసన్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

'పనులు చేసుకొని బిల్లులు ఇవ్వడం లేదు'

చిల్పూరు: మన ఊరు–మన బడి కార్యక్రమం మొదలైనప్పటి నుంచి వెంట పడి మరీ పనులు పూర్తి చేయించుకున్న అధికారులు బిల్లులు మాత్రం ఇవ్వడంలేదని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో రాజవరం, చిల్పూరు, ఫత్తేపూర్, శ్రీపతిపల్లిల్లో పాఠశాలల పనులను అధికారులు వారి మెప్పు కోసం కాంట్రాక్టర్ల వెంట ఉండి పనులు చేయించుకున్నారు. అందిన కాడల్లా అప్పులు తెచ్చి పనులు పూర్తిచేశామన్నారు. ఫిబ్రవరిలో పాఠశాలలను కూడా ప్రారంభించారు. అప్పటి నుంచి తాము బిల్లుల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోక పోవడంతో అప్పులు ఇచ్చిన వారు ఇళ్ల చుట్టూ తిరుగుతుండడంతో తాము దొంగల్లా మరోచోట తలదాచుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. కలెక్టర్ స్పందించి సమస్య పరిష్కరించాలని పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

నివాళి



రఘునాథపల్లి: కంచనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్, భవన నిర్మాణ రంగాల సంఘం మండల అధ్యక్షుడు పసుల ఏలియా తల్లి పసుల నర్సమ్మ (64) బుధవారం అనారోగ్యంతో మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ప్రగాఢ సానుభూతి తెలిపి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బీఎస్‌ఆర్‌కేఎస్ రాష్ట్ర నాయకులు మధు, కొమురయ్య, యాదగిరి, అంజయ్య, జోజి, శ్రీనివాస్, శ్రీనివాస్, రాజు, సిద్దయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

● వాడివేడిగా ఘన్‌పూర్ మండల సభ
● ఎక్సైజ్ అధికారుల తీరుపై సభ్యుల మండిపాటు



మాట్లాడుతున్న మారపాక రవి

స్టేషన్‌ఘన్‌పూర్: గ్రామాల్లో నెలకొన్న సమస్యల్ని గుర్తించి వాటిని పరిష్కరించేదిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో, బాధ్యతగా పనిచేయాలని ఘన్‌పూర్ జెడ్పీటీసీ, జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఘన్‌పూర్ మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ కందుల రేఖ గట్టయ్య అధ్యక్షత నిర్వహించగా జెడ్పీటీసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా వివిధ శాఖల అధికారులు నివేదికలు తెలుపుతుండగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల తీరుపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ ద్వారా గ్రామాల్లో సక్రమంగా నీరు రావడం లేదని, సమస్యపై స్పందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎక్సైజ్ శాఖ నివేదికను సీఐ భాస్కర్‌రావు తెలుపుతుండగా ఘన్‌పూర్ ఎంపీటీసీ గన్ను నర్సింహులు, నమిలిగొండ ఎంపీటీసీ రజాక్‌యాదవ్, కోఆప్షన్ సభ్యుడు తదితర సభ్యులు మండిపడ్డారు. గ్రామాల్లో బెల్టుషాపులు విచ్చలవిడిగా నడుస్తున్నాయని, తెల్లవారుజామునుంచి అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయన్నారు. బెల్టుషాపుల్లో అధిక ధరలకు కల్తీ మద్యం విక్రయిస్తూ ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. వైన్‌షాపుల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా పట్టించుకోవడం లేదని, ఏమైనా సమస్య ఉంటే ఎక్సైజ్ అధికారులకు ఫోన్ చేస్తే స్పందించడం లేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో జెడ్పీటీసీ స్పందిస్తూ సభ్యుల డిమాండ్ మేరకు బెల్ట్‌షాపులను నియంత్రించాలని ఎక్సైజ్ సీఐకి సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా పనిచేస్తూ గ్రామాల్లో నెలకొన్న సమస్యల్ని పరిష్కరించేలా చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన కోరారు. వైస్ ఎంపీపీ సుధీర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి పాల్గొన్నారు.

పల్లెదవాఖానాను సద్వినియోగం చేసుకోండి



వైద్యులను సన్మానిస్తున్న సర్పంచ్

తరిగొప్పుల: ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం పల్లె దావాఖానాలను ఏర్పాటు చేస్తుందని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ అర్జుల రమాసంపత్‌రెడ్డి సూచించారు. మండలంలోని అబ్దుల్‌నాగారంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొని కంటి అద్దాలను అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులను శాలువాతో సన్మానించారు. అనంతరం పల్లె దవాఖానా కమిటీని ఎన్నుకొన్నారు. చైర్మన్‌గా సర్పంచ్ రమా సంపత్‌రెడ్డి, కో చైర్మన్‌గా డాక్టర్ రవితేజ, మెడికల్ సెక్రటరీగా శ్రీవాణి వీహెచ్‌ఎంసీగా పంచాయతీ కార్యదర్శి భూక్య లింగం, న్యూట్రీషన్ సభ్యులుగా అంగన్‌వాడీ టీచర్లు రేణుక, మంజులను ఎన్నుకున్నారు. తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ అర్జుల సంపత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ తాళ్లపల్లి అనితారాజేశ్వర్‌గౌడ్, ఏఎన్‌ఎంలు ప్రేమ, ఆసియా బేగం, ఆశ వర్కర్లు శోభ, కనకమ్మ సీఏ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపల్లి సంత వేలం రూ. 30.06 లక్షలు

● ప్రభుత్వం ఆఫ్‌సెట్ ప్రైస్‌కు రూ.16.48 లక్షలు తగ్గింపు



వేలం నిర్వహిస్తున్న సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి

రఘునాథపల్లి: మండల కేంద్రంలో నిర్వహించే గొర్రెలు, మేకల అంగడి(సంత)కి బుధవారం స్థానిక కమ్యూనిటీ హాల్‌లో వేలం నిర్వహించగా కేవలం రూ.30.06 లక్షలకు చేరుకుంది. ఏడాది కాల పరిమితి ఉండే ఈ సంతకు ప్రభుత్వం ఆఫ్‌సెట్ ప్రైస్ రూ.51,17,851 నిర్ణయించింది. ఇప్పటికే రెండు సార్లు నిర్వహించిన వేలంలో ఆ ప్రైస్ రాక పోవడంతో వాయిదా వేశారు. బుధవారం సర్పంచ్ పోకల శివకుమార్, జెడ్పీటీసీ బొల్లం అజయ్, పంచాయతీ కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన వేలం పాటకు గతంలో పాల్గొన్న ఐదుగురు ఔత్సాహికులతో పాటు కొత్తగా ముగ్గురు పాల్గొన్నారు. మండల కేంద్రానికి చెందిన గండె ప్రదీప్ రూ.30.06 లక్షలకు చేజిక్కించుకున్నారు. అయితే ఈ వేలంలో మండల, జిల్లా స్థాయి పంచాయతీ అధికారులు పాల్గొనక పోవడం.. వేలం రూ.16.48 లక్షలు తగ్గడంతో అనుమానాలకు తావిస్తోంది. కార్యక్రమంలో ఎంపీటీసీ పేర్ని ఉషారవి, ఉప సర్పంచ్ యాద రాములు తదితరులు ఉన్నారు.

గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్

నర్మెట: సేవాలాల్ మహరాజ్ అందించిన సేవలు.. చూపిన మార్గం ఆయనను గిరిజనుల ఆరాధ్యదైవంగా చేసిందని సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు అంగోత్ రాంబాబు, పీఠాధిపతి రమేష్ మహరాజ్ అన్నారు. స్థానిక కేఎస్‌ఆర్ గార్డెన్స్‌లో సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ శంకర్‌నాయక్ అధ్యక్షతన బుధవారం కేర్పాటు చేసిన సమావేశంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ధరావత్ రమేష్, ఉపాధ్యక్షులుగా ధరావత్ భిక్షపతి, భానోత్ సుమన్, కార్యదర్శిగా ధరావత్ వినోద్ ఎన్నికయ్యారు. జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్ నాయక్, కార్యదర్శి సృజన్, అనిల్ చౌహాన్, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు ధరావత్ రాజు, జెడ్పీటీసీ మాలోత్ శ్రీనివాస్, సర్పంచ్ లకావత్ కిరణ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.



సేవాలాల్ రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని వనమాల షాపింగ్‌మాల్, ప్రగతి విద్యాలయం, బృదావనం ఫంక్షన్‌హాల్‌లో బుధవారం పాలకుర్తి అగ్నిమాపక కేంద్ర అధికారి దయాకర్ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాద నివారణ, భద్రత చర్యలపై వివరించారు. అనంతరం అగ్ని ప్రమాదల పై అవగాహన కల్పిస్తూ వాల్‌పోస్టర్లు, కరపత్రలను పంపిణీ చేశారు. ప్రగతి ప్రిన్సిపాల్ వీరమనేని వెంకటేశ్వర్‌రావు, మాధవరావు, ప్రసాద్‌రావు, ఆంజనేయులు, అగ్నిమాపక కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డెరలను షెడ్యూల్ తెగలో చేర్చాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: వడ్డెర కులస్తులను షెడ్యూల్ తెగలో చేర్చాలని తెలంగాణ వడ్డెర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లపు సోమయ్య డిమాండ్ చేశారు. వడ్డెర కులస్తుల హక్కుల సాధనకు ఈనెల 21న హనుమకొండలోని కల్యాణి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే వరంగల్, హనుమకొండ జిల్లాల వడ్డెర మహాసభల కరపత్రాలను బుధవారం స్థానికంగా ఆవిష్కరించారు. అనంతరం జిల్లా గౌరవ అధ్యక్షుడు బోసు ఐలయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు గడిచినా వడ్డెర్ల బతుకుల్లో ఎలాంటి మార్పు రాలేదని, తరతరాలుగా రాయి, మట్టి పనులు చేస్తూ సంచార జీవితం గడుపుతున్నారని అన్నారు. విద్య, ఉద్యోగ, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వెనుకబడి దుర్భర జీవితాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కులస్తుల సంక్షేమం కోసం 'వడ్డెర బంధు', చనిపోయిన వారికి ఎక్స్‌గ్రేషియా, కాంట్రాక్టు పనుల్లో 20 శాతం రిజర్వేషన్, అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లలో ప్రాధాన్యత, 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివరాత్రి దుర్గయ్య, రాపోలు సమ్మయ్య, సత్తయ్య, కుమారస్వామి, రాజు, భాస్కర్, కొమురయ్య, యాదగిరి, పోశయ్య తదితరులు పాల్గొన్నారు.

వీగిన అవిశ్వాసం

కంచనపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా మరోసారి రవీందర్



చైర్మన్ రవీందర్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే

రఘునాథపల్లి: మండల పరిధి కంచనపల్లి వ్యవసాయ సహకార సంఘం చైర్మన్, వైస్ చైర్మన్‌లపై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. మెజారిటీ డైరెక్టర్ల మద్దతు ఉండటంతో మరోసారి చైర్మన్‌గా చీమలపాటి రవీందర్, వైస్ చైర్మన్ ధర్మా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. చైర్మన్ రవీందర్, వైస్ చైర్మన్ ధర్మా అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని అధికార బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన డైరెక్టర్లతో పాటు కాంగ్రెస్ డైరెక్టర్లు కలెక్టర్ శివలింగయ్య, జిల్లా సహకారం సంఘం అధికారికి వినతి పత్రం అందజేశారు. దీనికి స్పందించిన అధికారులు సొసైటీకి చెందిన 13 మంది డైరెక్టర్లకు నోటీసులు ఇచ్చి అవిశ్వాస తీర్మానంపై బుధవారం సమావేశం నిర్వహించారు. అయితే అవిశ్వాస సమావేశానికి బీఆర్‌ఎస్‌తో పాటు, కాంగ్రెస్ డైరెక్టర్లు గైర్హాజర్ కావడంతో రవీందర్‌ను చైర్మన్‌గా, ధర్మాను వైస్ చైర్మన్‌గా జిల్లా సహకార సంస్థ అధికారి కిరణ్‌కుమార్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజయ్య సొసైటీ కార్యాలయం వద్దకు చేరుకొని రవీందర్‌ను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గవ్వాని విజయనాగేశ్వర్, ఎంపీటీసీ కేమిడి రమ్యరాజు, సీఈఓ వంగ శ్రీనివాస్, ముసిపట్ల విజయ్, గుండె జోషఫ్, వంగ శ్రీనివాస్, ప్యారపు రాములు, తిప్పారపు బాబురావు, రమ్య ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

లింగాలఘనపురం: చాలీచాలని వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్న వీఓఏలకు కనీస వేతన చట్టం అమలు చేస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆముదాల సుజాత, ఎండి తహారా బేగం డిమాండ్ చేశారు. బుధవారం ఐకేపీ, సమాఖ్య కార్యాలయం వద్ద వీఓఏల సంఘం ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రంతో త్వరలో తలపెట్టిన సమ్మె విషయమై ఐకేపీ ఏపీఓకు వినతి పత్రం అందజేశారు.

గంజాయి తరలిస్తున్న ఐదుగురి పట్టివేత



గంజాయి విక్రయదారులను చూపుతున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

బచ్చన్నపేట: అక్రమంగా గంజాయి సేవిస్తూ, రవాణా చేస్తున్న వారిని బచ్చన్నపేటలో పోలీసులు పట్టుకున్నారు. బుధవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో జనగామ ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా.. మొండి కుంట వద్ద చిన్నరామన్‌చర్లకు చెందిన మంత్రి శ్రీకాంత్, కొన్నెకు చెందిన వేముల రవితేజ, బసిరెడ్డిపల్లికి చెందిన బండకింది దిలీప్, సికింద్రాబాద్‌కు చెందిన మహమ్మద్ హాజీ, మరో మైనర్ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేయగా.. నాలుగు కిలోల ఎండు గంజాయి లభించింది. దాని విలువ సుమారు రూ.40 వేలు ఉంటుంది. వీరంతా ముఠాగా ఏర్పడి ఆంధ్రప్రదేశ్‌లోని సీలేరు నుంచి గంజాయిని తెచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు తెలిసింది. నిందితుల నుంచి గంజాయి, సెల్‌ఫోన్లు స్వాధీనపర్చుకున్నారు. గంజాయిని పట్టుకున్న పోలీసులను ఏసీపీ అభినందించారు. కార్యక్రమంలో నర్మెట సీఐ నాగబాబు, ఎస్సై నవీన్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ బదే రాజు, కానిస్టేబుళ్లు జమాల్, అనిల్, సత్యనారాయణ, పలువురు పాల్గొన్నారు.

దళితుల ఆర్థికాభివృద్ధే ధ్యేయం



పాలకుర్తి టౌన్: తీగారం గ్రామంలో 'దళితబంధు' లబ్ధిదారుడి కారు వద్ద ఈడీ

జనగామ/పాలకుర్తి టౌన్: దళితుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం దళితబంధు పథకం అమలు చేస్తున్నదని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వెంకన్న అన్నారు. జిల్లాలోని పలు మండలాల పరిధిలో బుధవారం పర్యటించిన 'దళితబంధు' పథకంలో ఉపాధి పొందుతున్న లబ్ధిదారుల ఆర్థిక పరిస్థితులు, వ్యాపార స్థితిగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులకు కేటాయించిన ట్రాక్టర్, హార్వెస్టర్, ట్రాలీ ఆటో, సామగ్రి, డెయిరీ ఫామ్, కాంక్రీట్, జాన్ డియర్, వరి కోత మిషన్ల యూనిట్లతో పొందుతున్న ఉపాధి అవకాశాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ జిల్లాలో 185 యూనిట్లు మంజూరు చేశామని, దళిత రక్షణనిధి కింద పదివేలు జయచేసినట్లు చెప్పారు. లబ్ధిదారులు యూనిట్ల ద్వారా వచ్చే ఆర్థిక వనరుల ఎదుగుదల గురించి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య, కలెక్టర్ శివలింగయ్య ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారని, ఎట్టిపరిస్థితుల్లో దళితులు నష్టపోకుండా చర్యలు తీసుకునేలా సంబంధిత శాఖ అధికారులు కృషి చేయాలని కోరారు.

అభాగ్యులకు ఆపన్నహస్తం



ఆర్థిక సాయం అందజేస్తున్న శ్రీకాంత్‌గౌడ్ కుటుంబ సభ్యులు

దేవరుప్పుల: విశిష్టసేవలు అందిస్తున్న పెద్దమడూరు బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ ఓ నిరుపేద గిరిజన బాలుడు నిమోనియాతో చికిత్స పొందుతుండగా తక్షణ ఆర్థిక సాయం అందించి అభాగ్యులకు ఆపన్నహస్తంగా నిలుస్తున్నారు. బుధవారం మండలంలోని లాకావత్‌తండా(డి)కు చెందిన లావుడ్యా ప్రమీల, రవీందర్ కుమారుడు నిమోనియాతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో కుటుంబ సభ్యులు కారుపోతుల శ్రీనివాస్ ద్వారా రూ.35 వేల ఆర్థిక సాయం అందించారు. సాయం అందించడం పట్ల బీఆర్‌ఎస్ మండల నాయకులు బస్వ మల్లేష్, ఎంపీటీసీ లావుడియా ఉపేందర్, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు లాలు కృతజ్ఞతలు తెలిపారు.

రజకులు రాజకీయంగా ఎదగాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎల్లయ్య తదితరులు

బచ్చన్నపేట: రజకులు రాజకీయంగా ఎదగాలని అన్ని రంగాల్లో మరింత చైతన్యం కావాలని ఆ సంఘం మండల కన్వీనర్ మిన్నాలపురం ఎల్లయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఈ నెల 29, 30 తేదీల్లో జిల్లా కేంద్రంలో వైష్ణవి గార్డెన్‌లో జరిగే రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రజకులకు జనాభా ప్రాతిపదికన అందాల్సిన సబ్సిడీలు, రాయితీలు అందడం లేదన్నారు. రజకులకు ప్రత్యేక వసతులను కల్పించాలని, పలు సమస్యలను చర్చించుకోవడానికి నిర్వహించే ఈ మహా సభలకు రజకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. మండల కో కన్వీనర్ పెనిమెల్లి వెంకటేశ్వర్లు, మిన్నాపురం కనుకయ్య, నాయకులు మల్లయ్య, అశోక్, మనోహర్, శ్రీధర్, రాజు, పూలమ్మ, పోచమ్మ, లచ్చమ్మ పాల్గొన్నారు.

గ్రామాలకు తాగునీరు అందిస్తాం..



మాట్లాడుతున్న శ్రీనివాస్

బచ్చన్నపేట: మిషన్ భగీరథ పథకం ద్వారా జిల్లాలోని అన్ని గ్రామాలకు సకాలంలో తాగునీరు అందిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని కొన్నెలో పర్యటించి తాగునీరు సకాలంలో గ్రామ జనాభాకు సరిపడా వస్తుందా లేదా అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామానికి నీరు సరఫరా చేసే వాటర్ ట్యాంక్‌లను పరిశీలించారు. సర్పంచ్ వేముల వెంకట్‌గౌడ్, డీఈ అనిల్‌కుమార్, ఏఈ అరుణ, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడిన చైర్మన్‌కు అభినందనలా..?

రఘునాథపల్లి: కంచనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చీమలపాటి రవీందర్ అనేక అవినీతి అక్రమాలకు పాల్పడితే అతడిని ఎమ్మెల్యే రాజయ్య శాలువాతో సత్కరించి అభినందించడం దుర్మార్గమని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి రాపోలు రామ్మూర్తి ఆరోపించారు. బుధవారం కాంగ్రెస్ డైరెక్టర్లు, పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడు సంవత్సరాలుగా సర్వసభ్య సమావేశం నిర్వహించని పాలక వర్గాన్ని రద్దు చేయాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. పాలకవర్గాన్ని రద్దు చేయకుండా ఎమ్మెల్యే ఆదేశాలతో అవినీతికి పాల్పడిన చైర్మన్, వైస్ చైర్మన్‌లను కొనసాగేలా అధికారులు వ్యవహరించడం విడ్డూరంగా ఉందన్నారు. సొసైటీలో కోటికిపైగా అవినీతి జరిగిందని రైతులతో కలిసి ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. డైరెక్టర్ అయిత జయరాములు, రాహుల్ పృథ్వీ, మనోహర్, రవీందర్, సోమాజీ, పురుషోత్తం, రాజేందర్, పృథ్వీ, బుచ్చయ్య, శంకరయ్య, రాజు, సుధాకర్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

దేవరుప్పుల: మండలంలోని ధర్మాపురం, సీతారాంపురం(కడవెండి)లో నేడు(గురువారం) ఉదయం తలపెట్టిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళన సభలను జయప్రదం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్ కోరారు. ఈ సభలకు ముఖ్య అతి థిగా మంత్రి దయాకర్‌రావు రానున్నందున ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అనుబంధ శాఖల నాయకులు సకాలంలో హాజరు కావాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

పాలకుర్తి: విధుల పట్ల స్థానిక వ్యవసాయ అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమర్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని రైతు వేదికను సందర్శించి రైతుల రిజిస్ట్రేషన్ వివరాలు సేకరించారు. వ్యవసాయ విస్తరణాధికారి రైతు బంధు, క్లస్టర్ పంటలు, వివరాలు సేకరించాలని అన్నారు. వ్యవసాయ డివిజన్ అధికారి పరశురాం నాయక్, ఏఈఓ జె.రాధిక తదితరులు పాల్గొన్నారు.

నేత్రాల సేకరణ

జనగామ రూరల్: పట్టణంలోని రోండ్ల రాయచంద్రారెడ్డి (72) అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, బుధవారం లయన్ క్లబ్ ఆఫ్ జనగామ ఆధ్వర్యంలో కుమారుడు శ్రీనివాస్ రెడ్డి అనుమతుల మేరకు నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి తరలించారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

బచ్చన్నపేట: గత నెలరోజులుగా మండల కేంద్రంలో నిర్వహిస్తున్న గంగం మధుసూదన్ రెడ్డి స్మారక జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు బుధవారంతో ముగిసాయి. ప్రథమ బహుమతి బచ్చన్నపేట టీం కైవశం చేసుకొని రూ. 15116, ద్వితీయ స్థానంలో నిలిచిన కొడ్వటూర్ టీం రూ. 7116 లు గెలుపొందగా గంగం సుగుణాకర్‌రెడ్డి సమకూర్చిన నగదు బహుమతులను సర్పంచ్ గంగం సతీష్ రెడ్డి అందించారు.

ముగిసిన ఉప్పలమల్లన్న జాతర

దేవరుప్పుల: శివనామస్మరణంతో ఉప్పల మల్లన్న జాతర ముగిసింది. బుధవారం సాయంత్రం మండల కేంద్రంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో పూజారీ పెద్దాపురం వెంకటేశ్వరశర్మ పర్యవేక్షణలో వేద బ్రహ్మణులు శానకొండ శివకిరణ్, ఘనపురం సుమంత్ ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేక పూజలు చేశారు. అనంతరం జాతరకు వచ్చిన భక్తులు ఆశీర్వచనాలు అందుకొని దేవతమూర్తులకు మొక్కులు చెల్లించుకొని తీర్థప్రసాదాలు పొందారు.

సంక్షిప్తంగా

అన్నదానం..

జనగామ రూరల్: దూల్మిట్టకు చెందిన నాచగోని పద్మ, లక్ష్మణ్ దంపతుల కుమారుడు సాయికిరన్ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం పట్టణంలోని స్థానిక వర్ధన్ ఆశ్రమంలో అన్నదానం చేశారు. అలాగే జనగామ మండలంలోని పెంబర్తి గ్రామానికి చెందిన మల్యాల హేమ పుట్టిన రోజు పురస్కరించుకుని పేద పిల్లలకు వర్ధన్ ఆశ్రమంలో పండ్లు, పెన్నులు అందజేశారు. ఆశ్రమ నిర్వహకులు, లక్ష్మి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బచ్చన్నపేట బ్రాంచి మేనేజర్‌గా శివశంకర్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ యాదాద్రిభువనగిరి జిల్లా చాడలోని బ్యాంక్ నుంచి బచ్చన్నపేటకు బదిలీ అయినట్లు తెలిపారు.

రేపు లీగల్ ఎయిడ్ క్లినిక్

నర్మెట: ఈనెల 21న స్థానిక రైతు వేదికలో లీగల్ ఎయిడ్ క్లినిక్ నిర్వహించబడుతుందని ఏఓ ధరావత్ సంతోషి బుధవారం తెలిపారు. రైతుల భూసమస్యల పరిష్కారం దిశగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కోడ్ జడ్జి హాజరవుతారన్నారు. ఉదయం 8 నుంచి రైతులు తమ అర్జీలను సమర్పించవచ్చని ఆమె తెలిపారు. కార్యక్రమానికి మండల ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆమె కోరారు.


అధిక ఫీజు వసూళ్లతో ఇబ్బందులు

జఫర్‌గఢ్: అధిక ఫీజులతో డిగ్రీ విద్యార్థులను కాకతీయ యూనివర్సిటీ యాజమాన్యం ఇబ్బందులకు గురి చేస్తుందని ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు యాకన్న నాయక్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. కేయూలో పరిధిలో డిగ్రీ కోర్సు చేస్తున్న వారిలో చాలా మంది పేద విద్యార్థులు ఉన్నారన్నారు. వారిలో హాస్టల్‌లో ఉండి కష్టపడి చదువుతున్న పేద విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయడం దారుణమన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే రిలీజ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు రాజు, నరేష్ పాల్గొన్నారు.

స్థల పరిశీలన

జనగామ రూరల్: తెలంగాణ పోరాట యోధుడు, తొలి ఉద్యమ అమరుడు దొడ్డి కొమురయ్య విగ్రహ స్థాపనకు కురుమ సంఘం నాయకుల ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో గాంధీ చౌక్, అలాగే నెహ్రూ పార్క్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పట్టణ గౌరవ అధ్యక్షుడు మోటే శ్రీనువాస్, మాజీ అధ్యక్షుడు సిద్దిరాములు, జిల్లా ప్రచార కార్యదర్శి జాయ మల్లేష్, సంపత్, శ్రీశైలం, విజయ్ పాల్గొన్నారు.

చేయూత



జఫర్‌గఢ్: మండలంలోని సాగరం గ్రామానికి చెందిన 1999–2000 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థి తీగల నాగరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తోటి పూర్వ విద్యార్థులు మృతుడి కుటుంబానికి రూ.52 వేల ఆర్థికసాయం బుధవారం అందించారు. పూర్వ విద్యార్థులు మాతరాశి కృష్ణంరాజు, పరుశరాములు, రజాక్, వడ్లకొండ జయశంకర్, పాము ప్రసాద్, గడ్డల నర్సింగం, మేకల రాజు, బజ్జూరి శ్రీధర్, సంగ నరేష్, శ్యామ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

చిల్పూరు: గ్రామాల్లో నిరుపేదలకోసం ఉచితంగా ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని అభయ ఆస్పత్రి డాక్టర్ వైద్యం గౌతం అన్నారు. మండలంలోని చిన్నపెండ్యాలలో బుధవారం హనుమకొండకు చెందిన అభయ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మామిడాల లింగారెడ్డి, మందుల పంపిణీని ఎంపీటీసీ తాళ్లపల్లి ఉమసమ్మయ్య ప్రారంభించారు.